క్లుప్తంగా

స్వర్ణకారుల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా అధ్యక్షుడిని అభినందిస్తున్న భోగ శ్రావణి

రాయికల్: స్వర్ణకారుల సమస్యలను పరిష్కరానికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు ముగాల మారుతిని శనివారం రాయికల్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణకారుల సమస్యల పరిష్కారానికి నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సహకారంతో కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కుర్మ మల్లారెడ్డి, నాయకులు మచ్చ నారాయణ, భూమేశ్, సామల్ల సతీశ్, పటేల్ రాము, సత్యనారాయణ, రవీందర్, గోపి, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

వరదకాల్వ భూముల కబ్జాపై చర్యలు తీసుకోండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామ శివారు పరిధిలో ఎస్సారెస్పీ వరదకాలువ భూములను ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని శనివారం తహసీల్దార్ వినోద్‌కు గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారు. గ్రామం పరిధిలో ఎస్సారెస్పీ వరదకాలువకు 113 ఎకరాలు కోల్పోయామని, వాటికి ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చిందన్నారు. వరదకాలువకు చెందిన భూమిని కొందరు కబ్జా చేసి పంటలు సాగు చేస్తున్నందునా భవిష్యత్తులో ఇబ్బందులుంటాయన్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి



అధికారిని సత్కరిస్తున్న సిబ్బంది

జగిత్యాల: పశుసంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని పశుసంవర్ధక శాఖ అధికారి ప్రకాశ్ అన్నారు. శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా ఉద్యోగులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఐక్యతతో పనిచేసి జిల్లాలోనే పశుసంవర్ధక శాఖ పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు బోనగిరి నరేశ్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఆనంద్, కోశాధికారి వెంకటరమణ, గణేశ్, రాజ్‌కుమార్, రవీందర్, వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రామాజీపేటలో మాట్లాడుతున్న మధుసూదన్

రాయికల్: ప్రభుత్వ పథకాలను మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్‌సీ కోట మధుసూదన్ కోరారు. శనివారం మండలంలోని రామాజీపేటలో మహిళా సంఘ సభ్యులకు ఆర్థిక అక్షరాస్యత, సైబర్ మోసాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు క్రమం తప్పకుండా పొదుపు అలవర్చుకోవాలని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ క్రైమ్ నంబరు 1930 టోల్‌ఫ్రీ నంబరును సెల్‌ఫోన్‌లో సేవ్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ సీసీ లావణ్య, వీవోఏలు పల్లవి, రఫియ పాల్గొన్నారు.

గోశాల నిర్మాణానికి భూమిపూజ

కోరుట్ల: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో గోశాల నిర్మాణానికి కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ యతిరాజం నర్సయ్య, ప్రధాన అర్చకులు బీర్నంది నర్సింహాచారి, ఆలయ ధర్మకర్తలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు

- అద్దె భవనాల్లో భీమారం మండల ప్రభుత్వ కార్యాలయాలు
- ఖాళీ భవనాల్లో కొనసాగిస్తే తప్పనున్న అద్దె భారం
- పట్టించుకోని అధికారులు



భీమారం మండలంలో నిర్వహణ లేక నిరుపయోగంగా ఉన్న భవనం

మేడిపల్లి: భీమారం మండలానికి కూతవేటు దూరంలో ఉన్న కమ్మరిపేటలో రెండు ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. చక్కని పార్కింగ్ స్థలం, విశాలమైన గదులతో కూడిన భవనాలు ఉన్నప్పటికీ భవనాల నిర్వహణ, వాడకం లేక శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మూడేళ్ల క్రితం భీమారం నూతన మండలంగా ఏర్పడగా, ఇప్పటికీ మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు లేవు. అద్దె భవనాల్లోనే నడిపిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి అదనపు భారం పడుతోంది. మండల కేంద్రానికి కేవలం సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న కమ్మరిపేటలో ప్రభుత్వ భవనాలను వినియోగంలోకి తీసుకొస్తే ప్రభుత్వానికి అద్దె భారం తగ్గనుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. కమ్మరిపేట ప్రాథమిక పాఠశాలతో ఒక అంగన్‌వాడీ భవనం, మూడు తరగతి గదులు ఉన్నాయి. పాఠశాలలో తక్కువ మంది విద్యార్థులు ఉండటంతో ఒక్క రూంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. మరో రెండు భవనాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. ప్రభుత్వ కార్యలయాలకు సొంత భవనాలు నిర్మాణమయ్యేవరకు ఈ నాలుగు భవనాలు వాడుకుంటే ప్రభుత్వానికి అద్దె భారం తగ్గే అవకాశం ఉంది.

బీసీ బంద్ విజయవంతం





జగిత్యాలలో కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు కోరుట్ల: ర్యాలీలో జువ్వాడి నర్సింగరావు

జగిత్యాలజోన్/కోరుట్ల/ధర్మపురి/మెట్‌పల్లి/రాయికల్/కథలాపూర్/ఇబ్రహీంపట్నం/మేడిపల్లి/కొడిమ్యాల/గొల్లపల్లి/వెల్గటూర్/మల్యాల/పెగడపల్లి/మల్లాపూర్/సారంగాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్ జిల్లాలో విజయవంతమైంది. అన్ని పార్టీల నాయకులు పాల్గొని పాఠశాలలు, దుకాణాలను,బ్యాంక్‌లను మూసివేయించారు. బంద్‌కు మద్దతుగా స్థానిక వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. బంద్‌ను పర్యవేక్షించిన అఖిలపక్షం నాయకులు ఆందోళన చేపట్టారు. బీసీ జేఏసీ నాయకులు మాట్లాడుతూ బీసీలకు చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు వచ్చే వరకు ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. కచ్చితంగా 42 శాతం ఇవ్వాలని కోరారు. ఇచ్చాకే ఎన్నికలు నిర్వహించాలని కోరారు.అన్ని పార్టీల నాయకులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

కొడిమ్యాల: జిల్లా స్థాయి క్రికెట్ అండర్ -17, జగిత్యాల జిల్లా మినీ స్టేడియంలోని నిర్వహించిన పోటీల్లో కొడిమ్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కోలా శ్రీహర్ష జిల్లా స్థాయికి ఎంపికయ్యాడు. క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచి, సెలెక్ట్ అయిన విద్యార్థిని ప్రిన్సిపాల్ వేణు అభినందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి ఎకనావిక్స్ లెక్చరర్ బండ్ల భాస్కర్, క్లాస్ టీచర్స్ చెలిమల జయపాల్ రెడ్డి, చిట్టి నర్సయ్య, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతకు చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి: రైలు ప్రయాణికుల భద్రతకు కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి పుల్లా రాజాగౌడ్ శనివారం కోరారు. పంజాబ్‌లో షార్ట్‌సర్క్యూట్ వల్ల రైలు బోగీలు దగ్ధమయ్యాయని, ఈ ప్రమాదాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే ప్రయాణికుల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

'బీసీల ద్రోహి కాంగ్రెస్'

పెగడపల్లి: బీసీలకు ద్రోహం చేస్తోంది కాంగ్రెస్ పార్టేనని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కకుండా చేస్తుందని ఉప ముఖ్యమంత్రి బట్టి పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మర్రిపల్లి సత్యం విమర్శించారు. పెగడపల్లిలో శనివారం మాట్లాడారు. 2023 ఎన్నికల ముందు కామారెడ్డిలో జరిగిన సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి బీసీల ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తరువాత బీసీల రిజర్వేషన్ ఊసెత్తకుండా చట్టంతో చెలగాటం ఆడుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కాకపోతే కాంగ్రెస్ పార్టీ బీసీల ద్రోహిగా మిగిలిపోతుందన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు పల్లె మోహన్‌రెడ్డి, నాయకులు అనసూర్య, కొమురెల్లి, గట్టయ్య, మల్లేశం, బాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ నివేదిక చదువుతున్న అధికారులు

గొల్లపల్లి: ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ విచారణ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు సామాజిక తనిఖీ ప్రజావేదిక బహిరంగ విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా మండలంలో ఉపాధిహామీ పనులపై విచారణ జరిపారు. ఏడాదిలో చేపట్టిన రూ.7.02 కోట్లకు సంబంధించిన పనులలో అవకతవకలు జరిగాయని గుర్తించారు. రూ.62,809 అవకతవకలు చోటుచేసుకున్నాయి. వీటిని రికవరీ చేయాలని అధికారులు ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో పీడీ రఘువరన్, అడిషనల్ డీఆర్డీవో మదన్‌మోహన్, ఎస్క్యూపీవో మల్లికార్జున్, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో రాంరెడ్డి, అసిస్టెంట్ డీవీవో దేవేందర్‌రెడ్డి, ఏఈఈ పీఆర్ కల్యాణ్‌రెడ్డి, ఎస్ఆర్పీ దేవేందర్, ఏపీవో వేణు, సాంకేతిక సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు, మేట్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు లయన్స్ క్లబ్ అన్నదానం

మెట్‌పల్లి: బీసీ బంద్ సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ డిపోకే పరిమితమైన కార్మికులకు శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ దేవరాజ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను కొనియాడారు. పేదల కోసం వీటిని మరింత విస్తృతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు, ఆల్‌రౌండర్ గంగాధర్ తదితరులున్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధర్మపురి: భేటి బచావో భేటి పడావో కార్యక్రమంలో భాగంగా మండలంలోని నక్కలపేట ప్రభుత్వ పాఠశాలలో శనివారం మహిళ సాధికరాతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంకురం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని శివసాయి గ్రామైక్య సంఘం సభ్యులకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. పీవోసీఎస్‌వో చట్టం, చైల్డ్ హెల్ప్‌లైన్ సర్వీసెస్, సఖీ అందించే సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కేంద్రబృందం సభ్యులు, హెచ్ఎం చంద్రశేఖర్ తదితరులున్నారు.

బీసీల హక్కులను బీజేపీ కాలరాస్తోంది



విజయలక్ష్మి

జగిత్యాల: బీసీల హక్కులను బీజేపీ కాలరాస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమం కోసం కృషి చేస్తోందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. జస్టిస్ ఫర్ బీసీ బంద్ కార్యక్రమం సందర్భంగా ఆమె మాట్లాడారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపిందని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో భాగంగా బీసీల హక్కులకు పోరాటం, హక్కుల సాధన కోసం డిక్లరేషన్ ప్రకటించిందన్నారు. బీసీ బిడ్డను అని చెప్పుకుంటూ ప్రధాని నరేంద్రమోదీ బీసీల ఆంక్షలపైనే నీళ్లు చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీసీలపై ప్రేమ ఉంటే వెంటనే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ తరుపున కృషి చేస్తామన్నారు.

ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

వెల్గటూర్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా చేపట్టిన ప్రతీ గ్రామానికి నాణ్యమైన విత్తనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎండపల్లి మండలం గుల్లకోటలో జేజీఎల్ 24423 వరి రకం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం పొలాస శాస్త్రవేత్త డా. బి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుస్థాయిలో వరి విత్తనోత్పత్తి చేసేటప్పుడు తీసుకోలసిన జాగ్రత్తలు, మెలకువలు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మహేశ్, ఏఈవోలు మౌనిక, సందీప్ లావణ్య,వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ జన్మదిన వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కోరుట్ల : కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆరెస్ నాయకులు కార్యకర్తలు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వికలాంగుల ఆధ్వర్యంలో..

కోరుట్ల రూరల్: వికలాంగుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు.

కథలాపూర్: కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలు శనివారం కథలాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు.

డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ

ఇబ్రహీంపట్నం: మాదక ద్రవ్య రహిత సమాజంగా నిర్మూలిద్దామని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. శనివారం మండలంలోని డబ్బా గ్రామంలో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జన్మదినాన్ని పురస్కరించుకుని మాదక ద్రవ్యాలను గ్రామంలో నిషేధిద్దామని ప్రతిజ్ఞ చేశారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామ శివారులో గల వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ శనివారం తెలిపారు. గ్రామ పర్యటనకు వెళ్లగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ కనిపించడంతో పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.



ఫ్రెషర్స్ డే వేడుకలు

కోరుట్ల: పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టెక్నాలజీలో మరింత వృద్ధి సాధించాలని వక్తలు కోరారు. అనంతరం విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ పోతని ప్రవీణ్, ప్రిన్సిపాల్ నవీన్, పలు విద్యాసంస్థల ప్రతినిధులు ఎం.ఏ.బారీ, మహాదేవ్, ఆకుల రాజేశ్, రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.





సారంగాపూర్: మండలంలోని పెంబట్ల, కోనాపూర్, పోచంపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కోనాపూర్ శివారుల్లో కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ చాలా రోజులుగా అక్కడే పడి ఉందని, పోచంపేట శివారుల్లోని రైతుల పొలాల్లో పలు విద్యుత్ స్తంభాలు వంగిపోయి ఉన్నాయని, వీటిని సరిచేయాలని రైతులు కోరుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్,ఏఈ, ఎన్‌పీడీసీఎల్, సెల్ నంబర్: 8712486203

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

మంచినీటి సమస్య తీర్చండి ..



తండాలో పనిచేయని బోరింగ్ వద్ద కాలనీవాసులు

సారంగాపూర్: బీర్‌పూర్ మండల కేంద్ర శివారుల్లోని లంబాడితండా, ఒడ్డెరగూడెం గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆయా కాలనీవాసుల కోరుతున్నారు. శనివారం పనిచేయని బోరింగ్‌లను చూపుతూ తమ ఆవేదన వ్యక్తం చేశారు. లంబాడి తండా ఎల్లమ్మ గుడి సమీపంలోని బోరింగ్‌తోపాటు, సమీపంలోని మరో బోరింగ్ పనిచేయక తాగునీరు, ఇతర అవసరాల కోసం నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ఎల్లమ్మ గుడి సమీపంలోని ఒడ్డెరగూడెం, లంబాడీ తండాలో మొత్తం 40 ఇళ్ల వరకు ఉంటాయని, రెండు వందలకుపైగా జనాభా ఉంటుందని దీంతో నీటి కోసం దూరం వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. దీనిపై సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకవచ్చినా స్పందించడం లేదని వెంటనే మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు



దీపావళి వేడుకల్లో ఆర్యవైశ్య మహిళలు

ధర్మపురి: పట్టణ ఆర్యవైశ్య, గురుదత్త మహిళా మండలి వారి సంయుక్త ఆధ్వర్యంలో ధర్మపురిలో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ సంబరాలను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ముందుగా శ్రీలక్ష్మీదేవి చిత్ర పటానికి పూలమాలలేసి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలతో హారతులిచ్చారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో..

పెగడపల్లి: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం ముందస్తు దీపావళి సంబురాలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో దీపాలు వెలిగించి టపాసులు కాల్చగా చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సూపర్‌వైజర్లు మహేశ్వరీ, సుభద్ర, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జువ్వాడి సానుభూతి

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని బాస ప్రవళిక జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. శనివారం ప్రవళిక భౌతికఖాయానికి పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు పూలమాల వేసి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వాల్గొట్ నరేశ్, తిరుపతిరెడ్డి, నేరేళ్ల దేవేందర్, తిమ్మణి రాములు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీపీఆర్వోగా నరేశ్



కలెక్టర్‌ను కలిసిన డీపీఆర్వో

జగిత్యాల: జెడ్పీ సీఈవోగా పనిచేస్తున్న నరేశ్‌కు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఇన్‌చార్జి డీపీఆర్వోగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేశ్ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు సిరిపూర్, పాతదాంరాజుపల్లి గ్రామాల్లో బాధిత కుటుంబాలను శనివారం పీసీసీ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు పరామర్శించారు. మల్లాపూర్‌లో మాజీ ఎంపీపీ వేంపేట నర్సారెడ్డి, తల్లి నర్సవ్వ, కాంగ్రెస్ నాయకులు ఎలాల శ్రీనివాస్‌రెడ్డి తండ్రి పెద్దరాజరెడ్డి మృతి చెందగా, బాధిత కుటుంబాలతో పాటు పాతదాంరాజుపల్లిలో గుండెపోటుతో మృతి చెందిన మామిడాల శ్రీనివాస్ కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆయన వెంట కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ కో-ఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డి, పీసీసీ ఫిషర్మెన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రుత్త నారాయణ, మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ సేవాదల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మారుతి, తదితరులు పాల్గొన్నారు.

ముద్దు రామకృష్ణయ్య జయంతి వేడుకలు

జగిత్యాలజోన్: విద్యావేత్త, మానవతావాది, తత్వవేత్త, ఏడు దశాబ్దాల క్రితం జగిత్యాల మల్టిపర్పస్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన ముద్దు రాంకృష్ణయ్య 118వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముద్దు రాంకృష్ణయ్య మెమోరియల్ సేవాసదన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సూరజ్ శివశంకర్ మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అనాటి విద్యా సంస్థల్లో ప్రవేశపెట్టి విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో మెమోరియల్ సేవాసదన్ సభ్యులు చంద్రమౌళి, సత్తయ్య, బాపు రెడ్డి, ఆనందం, గంగారాజం, రవీందర్, గంగాధర్, మీసాక్ అహ్మద్, నాగేందర్, అంజయ్య పాల్గొన్నారు.